క్లుప్తంగా

వీధిలైట్ల ఏర్పాటు



వీధి లైట్లను చూపిస్తున్న మాజీ సర్పంచ్ రమేశ్ తదితరులు

యాచారం: రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో బుధవారం మండల పరిధిలోని తాడిపర్తి, కొత్తపల్లి గ్రామాల్లో వీధి లైట్లను బిగించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు యాచారం మండలంలోని పలు గ్రామాల్లో వీధి లైట్ల బిగింపునకు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో కొన్ని రోజుల కింద మండలానికి వీధి లైట్లు వచ్చాయి. గ్రామాలకు వచ్చిన వీధి లైట్లను ఆయా గ్రామాల్లో బిగించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

షరతులు లేకుండా మాఫీ చేయాలని వినతి



వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్‌నాయకులు, రైతులు

కడ్తాల్: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని, బీఆర్ఎస్ యూత వింగ్ మండల అధ్యక్షుడు కంబాలపల్లి అంజి పేర్కొన్నారు. బుధవారం బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి మండల వ్యవసాయ అధికారి శ్రీలతను కలిసి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా కంబాలపల్లి అంజి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంక్షలు పెట్టడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, సిద్దిగారి వెంకటేశ్, లచ్యానాయక్, కొప్పు కృష్ణ, రాములు, బాబ్లు, రైతులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఓ, తదితరులు

తలకొండపల్లి: అర్హులైన రైతులందరూ రైతు బీమాకు ఆగస్టు 4లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంపూర్ రైతు వేదికలో రైతు బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులందరూ ఆయా గ్రామాల్లోని విస్తరణాధికారులకు తమ దరఖాస్తులను అందజేయాలని ఏఓ పేర్కొన్నారు. అనంతరం రైతు బీమా విధి విధానాలు, దరఖాస్తు ఫారానికి జతచేసే పత్రాలు, తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డి విగ్రహానికి నివాళి



నివాళులర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: కేంద్ర మాజీమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహానికి బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ప్రాంతానికి జైపాల్ రెడ్డి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్‌లు రాజగోపాల్‌రెడ్డి, చెన్న కిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్‌లు మహేందర్‌కుమార్‌రెడ్డి, సీనియర్ సభ్యులు డాక్టర్ దామోదర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్ఓ పాషా, సభ్యులు జూలూరి రమేశ్, కొండల్‌రెడ్డి, కండె ఓంకారం, మిట్టపల్లి అంజయ్య, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, నటరాజ్‌యాదయ్య, గంప శ్రీను, జూలూరి లింగయ్య, డాక్టర్ హరికాంత్‌రెడ్డి, సునంద తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ.. మాకేది?



రైతు వేదికభవనంలో రుణమాఫీ కోసం దరఖాస్తులు ఇస్తున్న రైతులు

- నేటికీ రైతుల ఖాతాల్లో జమకాని నగదు
- రైతు వేదికలు, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ఇబ్బందుల్లో రైతన్నలు
- పట్టించుకోని అధికారులు

మంచాల: ప్రభుత్వం రెండు దఫాలుగా రుణమాఫీ మంజూరు చేసినా మాఫీకానీ రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్న తమకు ఎందుకు మాఫీ కాలేదని మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మంచాల మండలంలో మొదటి విడుతగా లక్షలోపు 3,680 రైతు కుటుంబాలకు మాఫీ కావల్సి ఉంది. కానీ 3,200 రైతు కుటుంబాలకు మాఫీ అయ్యింది. ఇంక 480 రైతు కుటుంబాలకు వారివారి బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. రెండో విడుత లక్ష యాభ్జైవేలు రుణ మాఫీ 1,309 రైతు కుటుంబాలకు కావల్సి ఉండగా 1,084 రైతు కుటుంబాలకు మాఫీ అయ్యింది. 225 కుటుంబాలకు ఇంకా కాలేదు. రుణ మాఫీ రాని రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ కార్డు వంటివి తీసుకొని బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీ కానీ రైతులు మాత్రం తమకు ఎందుకు మాఫీ కావడం లేదని అయోమయానికి గురవుతున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. సంబంధిత అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారని మాఫీ కానీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రేషన్‌కార్డు లేక పోవడం, ఆధార్ కార్డు మిస్ మాచింగ్, ఒకే కుంటుంబంలో రూ.2లక్షలకు పైగా అప్పు ఉండడం, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్టు వంటి వారికి రుణ మాఫీ కావడంలేదని కొందరు చెబుతున్నారు. గతంలో ట్రాక్టర్లు కొనుగోలు చేసిన రైతులు, బతుకుదెరువు కోసం ఆటోలు నడుపుకున్న రైతుల రేషన్ కార్డులను తొలగించారు. కొంత మందికి తిరిగి రేషన్‌కార్డులు నమోదు చేశారు. మరికొందరివి నమోదు చేయలేదు.

నిత్యం వస్తున్నారు..

మండల కేంద్రంలోని రైతు వేదిక భవనానికి మాకు రుణ మాఫీ రాలేదనిపెద్ద సంఖ్యలో రైతులు వచ్చి పోతున్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది కంప్యూటర్లలో పరిశీలన చేసి కారణాలను రైతులకు వివరిస్తున్నారు. అధికారులు అడిగిన ఆధార్ కార్డు, పట్టా పాసు పుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం ఇచ్చాం. కంప్యూటర్లలో తప్పులతో నమోదు చేయడం వల్లే తమకు రుణమాఫీ కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన రైతులను గుర్తించి తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మిస్ మ్యాచింగ్ అంటున్నారు



మాది ఆస్మత్‌పూర్ గ్రామం. ఎకర వ్యవసాయ పొలం ఉంది. ఆరుట్ల ఎస్‌బీహెచ్ బ్యాంకులో నేను రూ.38వేలు పంట రుణం తీసుకున్నాను. రెండు దఫాలు రుణమాఫీ చేసినా నా పేరు రాలేదు. వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లగా ఆధార్ కార్డు మిస్ మ్యాచింగ్ వల్ల ఇతరుల పేరు చూపిస్తుందని చెబుతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– పుట్ట పర్వతాలు, ఆస్మత్‌పూర్

లిస్టులో పేరు లేదు



నేను గతంలో రూ.60వేలు పంట రుణం తీసుకున్నాను. రుణమాఫీ లిస్టులో నా పేరు లేదు. మంచాల రైతు వేదిక వద్దకు వెళ్లి అధికారులకు బ్యాంకు కాగితాలు చూపించాను. నా పేరుపై ఎలాంటి వివరాలు చూపించడం లేదని పేర్కొంటున్నారు. సాంకేతిక లోపంతో రుణ మాఫీ కాలేదంటున్నారు. తిరిగి మరల దరఖాస్తు పెట్టుకున్నా.

– కాళ్ల జంగయ్య, ఆస్మత్‌పూర్

ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం



అర్హత ఉండి పంట రుణ మాఫీలో పేర్లు రాని రైతులనుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేర విచారణ చేసి అందరికీ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

– జ్యోతిశ్రీ, మండల వ్యవసాయాధికారి, మంచాల

అభివృద్ధి, సంక్షేమంలో నిర్లక్ష్యం వద్దు

- మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలి
- ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: అభివృద్ధి, సంక్షేమంలో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామాల ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో వేగవంతంగా పనులు చేయాలని సూచించారు. అదే విధంగా తాగునీటి ట్యాంకులు శుభ్రం చేసి, ట్యాంకులకు పైకప్పులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైపులు లీకేజీలు కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజలకు విషజ్వరాలు, డెంగీ వ్యాధులు సోకకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈజీఎస్, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖల నుంచి అందే సహకారంతో రైతులు పండ్లతోటల పెంపకాన్ని చేపట్టాలన్నారు. యాచారం, నల్లవెల్లి, కేసీతండాల్లో పర్యటించి పండ్లతోటలు, మొక్కలకు తీసే గుంతలను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం రేపు దీక్ష


సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినర్సింహారెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మినర్సింహారెడ్డి

కడ్తాల్: ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 2వ తేదీ రాష్ట్ర సచివాలయం ముందు సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మినర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. 2019–24 మధ్య కాలంలో సర్పంచ్‌లుగా కొనసాగి అప్పటి ప్రభుత్వ సూచనలు, ఆదేశాల మేరకు గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వీధిలైట్ల ఏర్పాటు, అంతర్గత మురుగు కాల్వలు, పల్లెప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, మనఊరు–మన బడి, పల్లెప్రగతి, మిషన్ భగీరథ లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టామన్నారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చి దిద్దడంలో తమ కృషి ఉందన్నారు. అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం నుంచి సరైన సమయంలో నిధులు అందకపోయినా, సొంత గ్రామాన్ని అభివృద్ధి చేసే దిశగా తమ సొంత డబ్బులు వెచ్చించి అనేక పనులు చేయించామన్నారు. ఇంత చేసినా కూడా సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 6నెలలు గడిచినా, నేటికి తమ పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు పడుతున్న బాధలు వర్ణణాతీతమన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు అప్పులు చేసి ఖర్చు పెట్టిన సర్పంచ్‌లకు బిల్లులు రాక, ఆత్మహత్యలు చేసుకున్నారని, సమస్యను అధికారులకు, ప్రభుత్వం దృష్టికి, గవర్నర్ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం శూన్యమన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం సచివాలయం వద్ద నిర్వహించనున్న నిరసన దీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు తరలివచ్చి దీక్షను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నిధులు కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిప్రతం ఇస్తున్న కిషన్‌రెడ్డి

మాడ్గుల: గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అవసరమైన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక విజయ డెయిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు బాధాకరం

తుర్కయంజాల్: అక్రమ అరెస్టులు బాధాకరమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య తెలిపారు. బుధవారం రాగన్నగూడలోని తన ఇంట్లో అతనిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పోలీసుల చర్యను ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేసే ఉద్యమకారులను అణిచివేయడం దారుణమన్నారు. వేలాది మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా పట్టించుకోకపోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వ అంతర్యమేమిటని ప్రశ్నించారు.

హెచ్‌ఆర్‌డీ విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌లో సీతారాంపేట్‌లోని హెచ్‌ఆర్‌డీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మాస్టర్ ట్రైనర్ జోగు రాజశేఖర్ విద్యార్థులకు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. నగరంలోని ఫలక్‌నామాలో రెండు రోజులు జరిగిన పోటీల్లో సమీర్, రిషీ, సాయి, యశ్వంత్, నిఖిలేంద్రలు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఎస్.శ్రేయాస్, రిశాంత్‌లు సిల్వర్ సాధించారు. అనంతరం జ్ఞాపికతో పాటు సర్టిఫికేట్లు అందజేశారు. రాజశేఖర్‌ను పలువురు అభినందించారు.

స్కిల్‌వర్సిటీ ఏర్పాటుతో అబివృద్ధి

ఆమనగల్లు: ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని జిల్లాలోని మీర్‌ఖాన్‌పేటలో ఏర్పాటు చేస్తుందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనర్సింహా పేర్కొన్నారు. స్కిల్ డెవలెప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గత ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో వేలాది ఎకరాల భూములను సేకరించిందని, కానీ ఎక్కడా కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీ నిర్మించకుండా ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుతో పాటు ఈ ప్రాంత సమగ్రాబివృద్ధికి పనులు చేపడుతుందని ఆయన వివరించారు. అందులో భాగంగా యాబై ఎకరాలలో స్కిల్ యూనివర్సిటీకి ఆగస్టు 1న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కడ్తాల్ అధ్యక్షుడు బిచ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

జలాల్‌పురంలో ఏర్పాటు చేయండి

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: పోచంపల్లి మండలం జలాల్‌పురం గ్రామంలో గతంలో సేకరించిన వంద ఎకరాల భూమిలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భువనగిరి మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు బూర నర్సయ్యగౌడ్ ప్రభుత్వానికి విన్నవించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. ఇది కార్యరూపం దాల్చితే యువతకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. 1995లో అప్పటి ప్రధాని పివి నర్సింహ్మారావు పోచంపల్లి మండలం జలాల్‌పురంలో వంద ఎకరాల స్థలంలో స్వామి రామానంద తీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించారని, ఇందులోనే స్కిల్ ట్రైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నర్సయ్యగౌడ్ సూచించారు. తన సూచనను రేవంత్ సర్కార్ పరిగణలోకి తీసుకొని పునరాలోచన చేయాలని విన్నవించారు.

దాతల సహకారం అవసరం

ఇబ్రహీంపట్నం రూరల్: పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరమని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి జయశ్రీ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చుతో జయశ్రీ టై, బెల్టులు, షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత జయశ్రీ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ బడులకు దాతలు సహకారం అందించాలని తెలిపారు. నిరంతరం సంపాదనే లక్ష్యంగా కాకుండా సంపాదించిన దాంట్లో కొంతైన ఖర్చు పెట్టాలని అప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణకు కృషి



ఐక్యత చాటుతున్న సేవాలాల్ సేన నాయకులు

- సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్

కడ్తాల్: గిరిజన సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్లో గిరిజనుల హక్కుల సాధన, జాతి ఐక్యత, సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణపై సేవాలాల్ సేన అధ్యక్షుడు శంకర్‌నాయక్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్‌నాయక్ మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆదర్శనీయమన్నారు. ప్రతిఒక్కరూ నిజజీవితంలో ఆచరించాలని సూచించారు. వందల సంవత్సరాలు దాటినా సేవాలాల్‌ను స్మరించుకుంటున్నామంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంతో గొప్పవన్నారు. గిరిజనులు హక్కులను సాధించేందుకు ఐక్యతతో సంఘటితంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ప్రతీ హామీని వెంటనే అమలు చేయాలని, గిరిజన లంబాడీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని, తండాల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని, ఆయా తండాల పరిధిలోని అన్ని పంచాయతీలలో అన్ని శాఖల ఉద్యోగులను గిరిజనులచే భర్తీ చేయించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల 10 శాతం రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన జీవో 33కు వెంటనే చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలన్నారు. అనంతరం సేవాలాల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమలో స్టేట్ కన్వీనర్ సైదానాయక్, జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు కోట్యానాయక్, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, బీచ్యానాయక్, బిక్కునాయక్, లక్ష్మణ్, విజేందర్, రెడ్యానాయక్, శ్రీనునాయక్, దేవానాయక్, సీతారాంనాయక్, శ్రీను, మోహన్, చంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభ్యున్నతికి తోడ్పడాలి

కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి



శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: ఉద్యోగవిరమణ అనంతరం సమాజ సేవలో బాధ్యత వహించాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనేది శరీరానికే కాని మనస్సుకు కాదన్నారు. ఆలోచించే విధానాన్ని బట్టి మనలో ఉత్సాహం ఉరకలేస్తుందన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో సూపరింటెండెంట్ శ్యాంసుందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడారు. విధి నిర్వహణలో ఉద్యోగ విరమణ సహజమన్నారు. ప్రజలకు అందించిన సేవలు, చేసిన పనులే సమాజంలో గౌరవం తెస్తాయన్నారు. అనంతరం శ్యాంసుందర్ దంపతులను అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పూలమాలు వేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, తహసీల్దార్ రంగారెడ్డి, ఏఓ రాజు, ఎంపీఓ రఘు, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్ యాదవ్, నిర్మలాశ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్‌లు బక్కి కుమార్, దశరథ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రాములు, వెంకటయ్య, భాస్కర్‌రెడ్డి, లింగంగౌడ్, విజయ్‌రెడ్డి, విష్ణువర్ధన్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మదర్ డెయిరీ మేనేజర్‌కు సన్మానం



కరుణాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న రైతులు

యాచారం: మాల్ కేంద్రంలోని మదర్‌డెయిరీకి 12ఏళ్లు మేనేజర్‌గా సేవలందించి బదిలీపై వెళ్తున్న కరుణాకర్‌రెడ్డిని బుధవారం రైతులు ఘనంగా సన్మానించారు. మాల్ కేంద్రంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సభకు మదర్ డెయిరీ ఎండీ బి కృష్ణ, అకౌంటెంట్ సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి మదర్ డెయిరీ సొసైటీల చైర్మన్లు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కరుణాకర్‌రెడ్డి 12 ఏళ్లు మాల్ మదర్‌డెయిరీకి సేవలందించి, రైతులకు ఎంతో మేలు చేశారన్నారు. అనంతరం కొత్త మేనేజర్‌గా వెంకటయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు బందె మహేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, జంగయ్య, రామ్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలి

ఎంపీడీఓ కుసుమమాధురి



శెట్టిపల్లిలో మొక్క నాటుతున్న కుసుమమాధురి

ఆమనగల్లు: మండలంలో వన మహోత్సవం ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని ఎంపీడీఓ కుసుమమాధురి పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం సీతారాంనగర్ తండా, శెట్టిపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ రికార్డులను, నర్సరీ, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడానికి తీస్తున్న గుంతలను చూశారు. ఈజీఎస్ కూలీలకు పలు సూచనలు చేశారు. అనంతరం శెట్టిపల్లిలో కుసుమమాధురి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్‌ఏపీఓ మాధవరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో వారోత్సవాలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం వెంకటనర్సప్ప మాట్లాడుతూ ఈ సంవత్సరంలో ఒకే ఒక ప్రమాదం ఇబ్రహీంపట్నం డిపోలో చోటుచేసుకొని అతి తక్కువ ప్రమాద రేటును నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రమాద రహిత డిపోగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం మంచాల సీఐ బద్యానాయక్ మాట్లాడుతూ రోడ్డు మధ్యలో బస్సులు ఆపోద్దని, పూర్తిగా ఎడమ వైపు ఆపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, ఎంఎఫ్ సత్తయ్య, ఎస్టీఐ వెంకట్‌నాయక్‌లు పాల్గొన్నారు.



ఆర్టీసీ డ్రైవర్లను సన్మానించిన అధికారులు

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE : R.R. DISTRICT: AT L.B.NAGAR
G.W.O.P.NO. 61 OF 2024

Between :
T. Vijaya ....Petitioners
And
All Concerned ....Defendants

To
All Concerned
Please take notice that the Petitioners Tumkoju Vijaya, W/o. T. Chandraiah Chary, filed the above petition U/s 7 and 8 (2) of Hindu Minority Act 1956, Section 29 of the guardianship & wards Act 1890 on behalf of Granddaughter Master Tunkoju Vishwa Shrika is minor (Minor Granddaughter to alienate their petition schedule property by permitting to the petitioner in favour of prospective purchaser with an intention to use the sale proceeds for the benefit and necessity of minor granddaughter Tunkoju Vishwa Shrika, in respect of below mentioned property. The said O.P.No. 61 of 2024 stands posted on 05-08-2024 for appearance and counter of the Respondents. Therefore, if anyone have objection, they should be present in person or through Advocate on the aforesaid date at 10-30 A.M. at Hon'ble Principal District Judge court at L.B.Nagar. Otherwise, you will be set exparte on the said day and the Petition will be decided on merits.

SCHEDULE OF PROPERTY
All part and parcel of the open plot bearing No. 16, admeasuring 106 Sq. yards in Sy.No. 385 & 385 Part, situated at Khalsa Ibrahimpatnam Village & Mandal, R.R.District, bounded by: North: Neighbours Land, South: Plot No. 17, East: 25' Wide Road, West: Plot No. 23.
//BY ORDER OF COURT//
A. SRINIVAS KUMAR, Advocate, # Near MRO Office, Opp: Library, Ibrahimpatnam, R.R.Dist., Pin Code : 501 506, Ph: 9948772999, 9348007999.